# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

సంపుటి - 41 ఫిబ్రవరి - 2020 సంచిక - 7

# SATYA VAKKU

## క్రైస్తవ మాసపత్రిక

FEBRUARY- 2020

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త |
| బుధవారం సాయంత్రం | : | 6.30 గంటలకు రక్షణ |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 గంటలకు రక్షణ |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥ కాంతి ఛానల్‌లో |
| ప్రతి శనివారం ఉదయం | : | 6.30 ని॥లకు ఆరాధన |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

**Youtube లో satyavanicoc.kkd లో**

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

**P.O.BOX. 80, KAKINADA**

**PIN : 533004. Ph : 0884 - 2363722**

**98489 98547, www.satyavanicoc.com**

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి - 41 ఫిబ్రవరి - 2020 సంచిక -7


## యేసుక్రీస్తు యొక్క దైవత్వ సత్యము

### ( The Truth about the Deity of Jesus Christ )

దైవత్వము అనగా దేవుని యొక్క తత్వము, దైవము అయ్యుండుట అని యర్థము. గనుక మనము క్రీస్తు యొక్క దైవత్వాన్ని పరిశీలించునపుడు ఆయనలో యున్న దైవత్వమును, ఆయన దేవుని కుమారుడనని చెప్పుకొనిన దానిలోని సత్యమును పరిశీలింతుము. పాపము నుండి మానవజాతి యంతయును ఒక మధ్యవర్తి ద్వారా విమోచింపబడవలసి యున్నది. ఆ మధ్యవర్తి దేవుని, మానవుని సమాధానపరచి ఏకపరచు నిమిత్తము దైవ మానవత్వములను రెంటిని కలిగినవాడై యుండవలెను. యేసు ఈ రెండింటిని కలిగి యుండెను.

యేసుక్రీస్తు గొప్ప అద్భుతశక్తి కలిగినవాడే గాని ఆయనలో దైవత్వము లేదని కొందరు చెప్పుచుందురు. మరి కొందరయితే యేసుక్రీస్తు కూడా సృష్టింపబడిన వ్యక్తియనియు, ఆయనను దేవుడు ముందుగా సృష్టించెననియు చెప్పుచుందురు. 'యెహోవా సాక్షులు' అను ఒక గుంపువారు నేటికిని ఈ సంగతిని బోధింతురు. అట్లు

బోధించుటలో యేసు దేవుడు కాదని వారి ముఖ్యోద్దేశము.

"ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను" అని యోహాను 1:1లో వ్రాయబడి యున్నది. ఈ వాక్యమే యేసుక్రీస్తని మనము యోహాను 1:14లో చదువగలము : "ఆ వాక్యము శరీరధారియై కృపా సత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను." యోహాను వ్రాసిన ఆదికాలము దేవుడు సమస్తమును సృజించిన కాలారంభము ను సూచించుచున్నది. అదే మాటలతో మోషే ఆదికాండము వ్రాయుట కారంభించెను. ఆదియందు వాక్యముండెను అని యోహాను వ్రాసెనుగదా, అయితే ఆ వాక్యము ఎప్పటి నుండి ఉండెను? అనే ప్రశ్న మనకు రావచ్చును. ఆ వాక్యము నిత్యము, యెల్లప్పుడు ఉండెను అని మనము జవాబీయవలసి వచ్చును. ఆ వాక్యము క్రీస్తయియుండెను. ఆయన దేవుని యొక్క ప్రత్యక్షతయై యుండెను. ఈ లోకములో ఆయన దేవుని యొక్క సర్వ సంపూర్ణతయొక్క ప్రత్యక్షతయై యుండెను. 'వాక్యము దేవుని యొద్ద ఉండెను' అని యోహాను వ్రాసెను. దేవుని యొద్ద అనగా తండ్రియైన దేవునితో ముఖాముఖిగా యుండుటను, ఆయనతో సజీవముగల సంబంధమును, అతి సన్నిహితమైన సహవాసమును, ఏకత్వము కలిగి యుండుటను సూచించుచున్నది. మరల, 'వాక్యము దేవుడై యుండెను' అని యోహాను వ్రాసెను. అట్లు వ్రాయుటలో వాక్యము దేవుని యొక్క తత్వమును కలిగియుండెను, వాక్యమే దేవుడై యుండెను అని అతడు మనకు తెలియజేయుచున్నాడు.. ఆదియందు త్రియేకుడైన దేవునిలో వాక్యము ఒక వ్యక్తియై యుండెనని మనము గ్రహించవలెను.

క్రీస్తు తండ్రియైన దేవునితో సమానుడై యుండెను. ఫిలిప్పీ2:5-8 లో అపో.పౌలు ఇట్లు వ్రాసెను : "క్రీస్తు యేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగి యుండుడి. ఆయన

దేవుని స్వరూపము కలిగినవాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని, మనుష్యుల పోలికగా పుట్టి దాసుని స్వరూపమును ధరించుకొని తన్నుతానే రిక్తునిగా చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా తన్ను తాను తగ్గించుకొనెను".

మనము చదువుకొనిన వాక్య భాగములో పౌలు ఫిలిప్పీయులో యున్న క్రైస్తవులకు వినయ విధేయతలను గూర్చి బోధించుచుండెను. వినయ విధేయతలకు క్రీస్తు గొప్ప మాదిరిగా యున్నారు గనుకనే క్రీస్తుకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి యని అతడు హెచ్చరించెను. తన్నుతానే క్రీస్తు యెట్లు తగ్గించుకొనెనో పౌలు ఈ సందర్భము లో చూపించుచున్నాడు. ఈ లోకమునకు రాకమందు యేసు క్రీస్తు దేవుని స్వరూపమును, అనగా దైవత్వమును కలిగి యుండెను. ఆయన దేవునితో సమానముగా యున్నను, ఆయన దానిని విడిచిపెట్టి యిష్టపూర్వకముగా పరలోకము నుండి, ఈ లోకమునకు వచ్చెను. అట్లు చేయుటలో ఆయన దాసుని స్వరూపమును ధరించుకొని ఆకారమందు మనుష్యుడుగా యీ లోకమునకు వచ్చెను. ఆయన మరణము పొందునంతవరకు, అనగా అతి హీనకరమైన సిలువ మరణము పొందునంతవరకు తన్ను తాను తగ్గించుకొనెను. మనము రక్షించబడునట్లు దీని నంతటిని ఆయన చేసెను.

ఆయన నిత్యుడు ఈ వాక్యమును బట్టి క్రీస్తు యొక్క నిత్యత్వమును మనము గమనించగలము. ఆయన ఈ లోకమునకు రాకముందు తండ్రియైన దేవునితో యెల్లప్పుడు ఉండెను. ఆయన దేవుని స్వరూపములో యుండెను. తండ్రి కేమైతే గుణలక్షణములుండెనో వాటినే ఆయన కూడ కలిగియుండెను. క్రీస్తు

తన్ను తాను రిక్తునిగా చేసికొనినప్పుడు పరలోక మహిమలన్నిటిని విడిచిపెట్టి మానవ శరీరమును ధరించెను. లోకము పుట్టక మునుపు నుండి ఆయన మహిమను కలిగి యుండెను. భూమి మీద యున్నప్పుడు ఆయన యిట్లు ప్రార్థించెను : "తండ్రీ, లోకము పుట్టక మునుపు నీయొద్ద నాకు ఏ మహిమ యుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీ యొద్ద మహిమ పరచుము" (యోహాను 17:5). ఆయన చనిపోయి, సమాధి చేయబడి తిరిగి లేచి పరమునకు వెళ్ళి తండ్రితో యింతకు ముందున్న మహిమను ఇప్పుడు కలిగి యున్నారు.

క్రీస్తునందు దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా నివసించు చుండెను. కొలస్సయిలో కొన్ని అబద్ధ సిద్ధాంతములు బోధింపబడుటను విని పౌలు కొలస్సయిలో యున్న సంఘము నకు ఒక పత్రికను వ్రాసెను. మోషే ధర్మశాస్త్రము ఇంకను నిలిచి యున్న దనియు, యేసుక్రీస్తు నిజముగా దేవుడు కాదనియు ఆ అబద్ధ బోధకులు ప్రచారము చేయుట మొదలిడిరి. గనుక పౌలు వారిని ఇట్లు హెచ్చరించెను : "ఆయనను అనుసరింపక మనుష్యుల పారంపర్యాచారములను, అనగా ఈలోక సంబంధమైన మూల పాఠము లను అనుసరించి మోసకరమైన నిరర్థక తత్వజ్ఞానముచేత మిమ్మును చెరపట్టు కొనిపోవువాడెవడైన ఉండునేమో అని జాగ్రత్తగా ఉండుడి. ఏలయనగా దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించు చున్నది" (కొలస్స 2:8,9). బైబిలులో క్రీస్తు యొక్క దైవత్వమును బలముగా చూపించు వచనములలో ఇది ఒకటి.

యేసుక్రీస్తు శరీరమును ధరించిన దేవుడై యున్నాడని పౌలు చెప్పుచున్నాడు. ఏ విషయములో నైనను ఆయనలో దైవత్వము లేకుండలేదు. అందువలన క్రీస్తు దేవుడు కాదని వాదించువారి తత్వజ్ఞానము అసత్యమని

నిరూపింప బడెను. అంతేకాదు, యేసుక్రీస్తు "అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టి కి ఆది సంభూతుడై యుండెను" అని కొలస్స 1:15లో అతడు పలికెను. అంటే దేవుని యొక్క మూర్తిత్వము, పరిపూర్ణతలు క్రీస్తులో సంపూర్ణముగ ప్రతిబింబించెను. ఆయన దైవత్వమును ఎట్లు కలిగియున్నాడో తరువాత వచనములో అతడు తెలియజేసెను. ఆయన జ్ఞానమందును, సృష్టించే. శక్తి యందును, నిత్య ఉనికి యందును, విశ్వమంతటి మీదనున్న అధికార మంతటిలోను దైవత్వము ఆయనలో సంపూర్ణముగ నివసించెను.

మరియు "ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్న వాడు". అంటే అన్నిటి కంటె ముందుగా ఆయన సృజింపబడిన వాడని దీని యర్థము కాదు. "ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు". క్రీస్తు వలన క్రీస్తు ద్వారా సమస్తమును సృజింపబడెను. ఆయన అన్నిటి కంటె ముందుగా యుండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. ఆయన లేకుండా యేమియు కలుగ లేదు. సృష్టియంతటికి ముందునుండే క్రీస్తు ఉండెనని మనము గ్రహించవలెను. ఆద్యారంభముననే యున్నవాడు ఆదిలేని వాడనికూడ మనము గ్రహించుట అత్యవసరము. యేసుక్రీస్తు ఆది నుండి యుండెను. ఆదిలో ఆయన వాక్యమై యుండెను, ఆయన దేవుడై యుండెను. ఇప్పుడును ఆయప దేవుడై యున్నారు. అందుకే అపొ. పేతురు ఆయనను మన దేవుడును రక్షకుడైన యేసుక్రీస్తు అని సంబోధించెను (2 పేతురు 1:1). అపొ.పౌలు ఆయనను మహాదేవుడును మన రక్షకుడైన యేసు క్రీస్తని తీతు 2:13లో సంబోధించెను. యిందును బట్టి యేసుక్రీస్తు దేవుడని, దేవుని కుమారుడని మనము విశ్వసించ వలెను. మన పాపములను క్షమించు వాడాయనే గనుక మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెను.

# పరిశుద్ధాత్ముడు దేవుడై యున్నారు
## (The Holy Spirit is God)

యేసు దేవుడై యున్నారని గత పాఠంలో మనం తెలిసికొనియున్నాము. ఇప్పుడు పరిశుద్ధాత్ముడు దేవుడై యున్నారని తెలిసుకొందుము. యేసును గూర్చిన అంశము కంటే ఈ అంశము మరింత క్లిష్టమైనది. ఆయన పనిని గూర్చి వివరించుట క్లిష్టమైనది. ఆయన పని విషయమై అనేక భిన్నాభి ప్రాయములున్నవి. ఇప్పుడున్నది పరిశుద్ధాత్ముని యుగమని అనేకులు అభిప్రాయపడుదురు. అందువలన పరిశుద్ధాత్ముడు తండ్రియైన దేవుని కంటెను, యేసు ప్రభువు కంటెను ఎక్కువగా హెచ్చింపబడుట జరుగు చున్నది. అయితే అది పరిశుద్ధాత్ముని గూర్చి బైబిలు చెప్పుదానిని వక్రీకరిం చుట యగును.

పరిశుద్ధాత్ముడు ఒక వ్యక్తి

పరిశుద్ధాత్మ దేవునికి వ్యక్తిత్వము కలదు (యోహాను 14:26; 15:26;16:13,14). పరిశుద్ధాత్ముని ఒక వ్యక్తిగా ఈ లేఖనాల్లో యేసు 9 సార్లు సంబోధించారు.

పరిశుద్ధాత్ముడు మాటలాడును యితరులు మాట్లాడుటకు శక్తినిచ్చును. "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోస పరచు ఆత్మలయందును దయ్యముల బోధయందును లక్ష్యముంచి విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మతేటగా చెప్పు చున్నాడు" (1తిమోతి 4:1,2).

పరిశుద్ధాత్ముడు బోధించును : "ఆదరణకర్త అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26).

ఆయన నడిపించును : "అయితే ఆయన అనగా సత్య స్వరూపియైన ఆత్మ వచ్చినపుడు మిమ్మును సత్య

సత్యము లోనికి నడిపించు (యోహాను 16:13).

పరిశుద్ధాత్మునికి మనస్సున్నది : "మరియు హృదయములను శోధించు వాడు ఆత్మ యొక్క మనస్సు ఏదో యెరుగును" (రోమా 8:27).

ఆయనకు అనురాగమున్నది : "సహోదరులారా... నేను దేవుని చిత్తము వలన సంతోషముతో మీ యొద్దకు వచ్చి మీతో కలసి విశ్రాంతి పొందు నట్లు మీరు నా కొరకు దేవునికి చేయు ప్రార్థనల యందు నాతో కలసి పోరా...డవలెనని మన ప్రభువైన క్రీస్తును బట్టియు ఆత్మవలన ప్రేమను బట్టియు మిమ్మును బతిమాలు కొనుచున్నాను" (రోమా 15:30-32).

పరిశుద్ధాత్మునికి కోరిక చిత్తమున్నది: "అయినను వీటన్నిటిని ఆ ఆత్మ యొక్కడే తన చిత్తము చొప్పున ప్రతి వానికి ప్రత్యేకముగా పంచి యిచ్చుచు కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు" (1 కొరింథీ 12:11).

ఆయన దుఃఖించును : "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి; విమోచన దినము వరకు ఆయన యందు మీరు ముద్రింపబడి యున్నారు" (ఎఫెసీ 4:30).

పరిశుద్ధాత్ముడు దేవుడు

పరిశుద్ధాత్మ దేవుని గూర్చిన విపులమైన వివరణ అపొ.కా. 5:3,4 లో ఇయ్యబడియున్నది. అననీయ సప్పీరా అను దంపతులు తమ భూమిని పేదల కొరకై అమ్మి ఆ సొమ్ములో కొంత దాచుకొని మరికొంత భాగమును అపోస్తులుల పాదములు యొద్ద పెట్టుట మనము చూడగలము. అయినను అమ్మిన సొమ్మంతయు తెచ్చితిమని వారు అబద్ధమాడారు. "అప్పుడు పేతురు అననీయా నీ భూమి వెలలో కొంత దాచుకొని పరిశుద్ధాత్ముని మోస పుచ్చుటకు సాతాను ఎందుకు నీ హృదయమును ప్రేరేపించెను?"... నీవు మనుష్యులతో కాదు దేవునితోనే అబద్ధ మాడితివని వానితో చెప్పెను."

(అపొ.కా.5:3,4). అననీయ ఆడిన అబద్ధము పరిశుద్ధాత్మునికి దేవునికి చెప్పిన అబద్ధము అని పేతురు చెప్పెను. యిది పరిశుద్ధాత్మ దేవుడు తండ్రియైన దేవునితో సమానముగా యున్నట్లు గ్రహింపచేయుచున్నది.

ద్వితీయో 32:11లో "యెహోవా మాత్రము వాని నడిపించెను" అని యున్నది గాని యెషయా 63:10లో ఇశ్రాయేలీయులు తిరుగుబాటు చేసి పరిశుద్ధాత్మను దు:ఖింపజేసిరియని యున్నది. యిది స్వ విరుద్ధము కాదుగాని పరిశుద్ధాత్ముడు తండ్రి, కుమారుల వలె దేవుడై యున్నారు. తండ్రియైన దేవుడు యేసు ప్రభువు పరిశుద్ధాత్ముడు ముగ్గురు ఇశ్రాయేలీయులను నడిపించిరి. యెషయా 40:13 మరియు రోమా 11:34లో కూడ ఇట్టి పరిస్థితిని మనం కనుగొనగలము. యెషయా 40లో యెహోవా ఆత్మకు నేర్పిన వాడెవడు? అని యున్నది. రోమా 11లో ప్రభువు మనస్సును ఎరిగినవాడెవడు? ఆయనకు ఆలోచన చెప్పిన వాడెవడు? అని యున్నది. రోమా 11లో పౌలు ఈ వచనమును ఎత్తి చూపించి దానిని తండ్రియైన దేవునికి వర్తింపచేసాడు. మరల వారిద్దరు ఏకమైయున్నారని మనకు బోధించుచున్నాడు.

పరిశుద్ధాత్మునికి దైవ లక్షణములున్నవి.

హెబ్రీ 9:14లో ఆయన నిత్యుడగు ఆత్మయని చెప్పబడినది. పరిశుద్ధాత్ముడు సర్వజ్ఞానియని కూడ చెప్పబడినది. 1 కొరింథీ 6:19లో "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమైయున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తుకారు విలువ పెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" యని అపొ.పౌలు చెప్పాడు. క్రైస్తవుని యొక్క హృదయములో ఆత్మ నివసించుచున్నాడని చెప్పబడినది. క్రైస్తవులు ఈ ప్రపంచమంతా వ్యాపించి యున్నారు గనుక ఆత్మ సర్వాంతర్యామి కాకపోతే యిది సాధ్యము కాదు (కీర్తన 139:7).

అంతేకాకుండా ఆత్మ సర్వజ్ఞానియై యున్నారని చెప్పబడినది. "మనకైతే దేవుడు వాటిని తన ఆత్మ వలన బయలు పరచియున్నాడు. ఆ ఆత్మ అన్నిటిని దేవుని మర్మములను కూడ పరిశుద్ధాత్ముడు ఎరిగియున్నాడని చెప్పబడినది. అందువలన ఆయన దేవుడైయున్నారు. ఆ ఆత్మ పూర్ణ బలముతోను శక్తితోను యున్నట్లు మీకా 3:8లో చెప్పబడియున్నది.

## పరిశుద్ధాత్ముడు దేవుని కార్యములను చేయును

సృష్టి జరిగించు ప్రక్రియలో పరిశుద్ధాత్ముడు పాల్గొనియున్నారు. కీర్తన 33:6లో "యెహోవా వాక్కుచే ఆకాశములు కలిగెను. ఆయన నోటి ఊపిరిచేత వాటి సర్వసమూహములు కలిగెను" అని చెప్పబడెను. ఆయన నోటి ఊపిరియనగా ఆయన ఆత్మయే. అట్టిది మరియొకటి కీర్తన 104:30లో కనబడును "నీవు నీ ఊపిరి విడువగా అవి సృజింపబడును. అట్లు నీవు భూతలమును నూతన పరచు చున్నావు" అని అక్కడ చెప్పబడినది. ఈ భూమిని సృజించుటలోనే గాక పరిశుద్ధాత్ముడు ఈ భూమిని సంరక్షించి నూతన పరిచి యున్నారు.

ఆత్మయే జీవింపచేయునని యేసు ప్రకటించారు (యోహాను 6:33). దేవుడొక్కడే జీవము నీయగలరు అయితే ఇక్కడ పరిశుద్ధాత్ముడు జీవింప జేయువాడని యేసు చెప్పారు. అనగా పరిశుద్ధాత్ముడు దేవుడై యున్నారు. 1 పేతురు 3:18లో పేతురు యేసు ప్రభువు యొక్క శ్రమలను, ఆయన మహిమను మనకు వర్ణించుచున్నాడు. మానవజాతి దేవుని యొద్దకు వచ్చునట్లు యేసు శ్రమపొందారని పేతురు చెప్పుచున్నాడు. భౌతికంగా ఆయన చంపబడ్డారు గాని ఆయన ఆత్మ విషయంలో బ్రతికింపబడ్డారు. రోమా 8:11లో "మృతులలో నుండి యేసును లేపిన ఆత్మ" యని పౌలు చెబుతాడు. ఆయన మనలను కూడ లేపును.

యేసు యొక్క అవతారమే పరిశుద్ధాత్మ దేవుని యొక్క రుజువై యున్నది. పరిశుద్ధాత్ముని వలన యేసు కన్య మరియ యొక్క గర్భవాసియాయె నని మత్తయి లూకా వ్రాసారు (మత్తయి 1:20; లూకా 1:35). ఒకడు ఎవని వలన జనింపచేయబడునో అతడా యన కుమారుడగును. అయినను యేసు దేవుని కుమారుడని పలుచోట్ల చెప్పబడెను. గనుక ఆత్మ దేవుడై యున్నారు. దేవుడొక్కడే యను బోధను యిది నిర్ధారించుచున్నది. ఆ ముగ్గురు ఏకము కాకపోతే యేసుకు ఇద్దరు తండ్రులున్నట్లగును!

**పరిశుద్ధాత్ముడు ఆరాధనా మూర్తి**

2 కొరింథి 13:14లో దైవత్వ ములోని వ్యక్తిగా పరిశుద్ధాత్ముడు చెప్ప బడెను. "ప్రభువైన యేసుక్రీస్తు కృపయు దేవుని ప్రేమయు పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికిని తోడై యుండునుగాక". ఈ త్రిత్వములో వేరే ఇంకొక పేరును చేర్చుట దేవదూషణ యగును. యేసు యిచ్చిన గొప్ప ఆజ్ఞలో కూడ ఇట్టిదే మనకగుపడును: "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులను గా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమియ్యుడి". ఎవరి నామము ననైనా బాప్తిస్మము పొందుట ఒక ఆరాధన క్రియయగును. పౌలు తన నామమును బట్టి ఎవరైనా బాప్తిస్మము పొందుట ఖండించెను (1కొరింథీ 1:13). అట్లు పరిశుద్ధాత్ముడు తండ్రి కుమారులతో సమానముగా ఆరాధనీయుడు.

**ముగింపు**

పైన చెప్పబడిన దానిని బట్టి పరిశుద్ధాత్ముడు దేవుడై యున్నారు, తండ్రియైన దేవుని వలెను, కుమారుడైన క్రీస్తు వలెను ఆయన ఒకే రకమైన లక్షణములు కలిగియున్నారు. గనుక ఆత్మ దేవుడై యున్నారు. తరువాతి సంచికలో ఆ ముగ్గురు ఏకమై ఎట్లున్నారో తెలిసికుందాము.

-జెఫ్రీ కేట్స్

# జ్ఞానము గల చిన్న జీవులు

## ( Four Little but wise Things )

కొంతమంది చిన్న వయస్సు నుండి తమ యొక్క ప్రతిభను చూపించే వారిగా ఉంటారు. విద్యలోను, ఉద్యోగములోను తమదంటు ఒక శైలిలో విజయాలను సాధిస్తా ఉంటారు. చిన్న వారైనా వారి నుండి మనం ఎన్నో నేర్చు కొనవలసిన విషయాలు ఉంటాయి. అలాగే మిక్కిలి చిన్న జీవుల నుండి కొన్ని పాఠాలు బైబిలు ద్వారా నేర్చుకొన వచ్చును.

సామెతలు 30:24-28లో జ్ఞానముగల జీవులు నాలుగు కనబడతాయి. అవి చీమలు, చిన్న కుందేళ్ళు, మిడతలు, బల్లులు. ఇవి జ్ఞానము గల జీవులుగా గ్రంథమందు మనకు కనబడతాయి.

1. చీమలు : (సామెతలు 30: 25). "చీమలు బలము లేని జీవులు అయినను అవి వేసవిలో తమ ఆహారమును సిద్ధపరచుకొనును" అని వ్రాయబడినది. చీమలు ముందు చూపు గల జీవులు. వర్షాకాలం వస్తే ఆహారం దొరకదేమో అనే భయం వాటికి ఉంటాది. అలాగే మనం ఈ లోకంలో భౌతిక సంబంధమైన ఆహారం కొరకు సిద్ధపాటు కలిగి ఉండాలి. ప్రసంగి 9:10లో చేయుటకు నీ చేతికి వచ్చిన యే పనినైన నీ శక్తి లోపం లేకుండా చేయుమని గ్రంథము చెప్పుచున్నది. కనుక మన పని మనం సక్రమముగా చేసి కుటుంబమును పోషించుకొనే బాధ్యత మనపై ఉన్నది.

సామెతలు 6:6-11 వచనము లో మనకు చీమల గురించి విపులముగా తెలపబడినది. సోమరీ చీమల యొద్దకు వెళ్ళి వాటి నడతను కనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుమని, అలాగే వాటికి న్యాయాధిపతి లేకున్నా విచారణకర్త లేకున్నా అవి ఎల్లప్పుడు కష్టపడుతూనే ఉంటాయి. దేవుడు మనకు ఇచ్చిన పనిని మనం సక్రమముగా చేస్తున్నామా? లేక సోమరిగా ఉంటున్నామా? ఒకవేళ

నీవు సోమరిగా ఉంటే దోపిడిగాడు వచ్చినట్లు దారిద్ర్యము నీ యొద్దకు వచ్చును. ఆయుధ ధారుడు వచ్చునట్లు లేమి నీ యొద్దకు వచ్చునని గ్రంథములో మనకు చెప్పబడినది. **2థెస్స 3:10-12**లో నీవు కష్టపడకుండా భోజనము చేయుటకు అర్హుడవు కావు అని చెప్పబడినది. కనుక మనం కష్టపడి ఆహారమును సంపాదించుకొనుట దేవుని చిత్తమై యున్నది.

ప్రసంగి **2:24-26**లో "అన్నపానములు పుచ్చుకొనుట కంటెను తన కష్టార్జితముచేత సుఖపడుట కంటెను నరునికి మేలుకరమైన దేదియులేదు. ఇదియును దేవుని వలన కలుగునని నేను తెలిసికొంటిని ఆయన సెలవు లేక భోజనము చేసి సంతోషించుట ఎవరికి సాధ్యము" అని ప్రసంగిచెప్పడం మనం చూస్తాము. సంపాదన కూడా దేవుని ఆజ్ఞ ప్రకారం సక్రమముగా సంపాదించాలి. అక్రమ సంపాదన దేవునికి ఇష్టములేదు. నీ సంపాదన దేవుని యందు లేకపోతే హగ్గయి **1:6**లో "మీరు విస్తారముగా విత్తినను మీకు కొంచెమే పండును. మీరు భోజనము చేయుచున్నను ఆకలి తీరక యున్నది. బట్టలు కప్పుకొనుచున్నను చలి ఆగకున్నది. పనివారు కష్టము చేసి జీతము సంపాదించుకొనిన జీతము చినిగిపోయినను సంచిలో వేసినట్టుగా ఉన్నది". కనుక మన సంపాదన దేవుని యందు మాత్రమే యుండాలి. దేవుని తోడు లేని సంపాదన సంపాదనే కాదు. కనుక చీమల వలే కష్టపడే స్వభావాన్ని కలిగి ఉండాలి.

భౌతిక సంబంధమైన ఆహారం మనకు అవసరమే కాని దానితో పాటు మనకు పరలోక సంబంధమైన జీవాహారం అవసరమై యున్నది. ఆ జీవాహారం దేవుని నుండి మనకు లభించును. (మత్తయి 4:3,4) "ఆ శోధకుడు ఆయన వద్దకు వచ్చి నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుమనెను. అందుకాయన మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదు గాని దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాట వలనను జీవించును అని వ్రాయబడియున్న

దనెను" దేవుని మాట అనగా దేవుని యొక్క వాక్యము. జీవాహారము అనగా దేవుని యొక్క వాక్యమే. ఆ వాక్యమే మన మధ్య యేసుక్రీస్తుగా ఉన్నారు. "అందు చేత యేసు వారితో ఇట్లనెను జీవాహారము నేనే, నా యొద్దకు వచ్చువాడు ఏమాత్రము ఆకలి గొనడు. నా యందు విశ్వాసముంచు వాడు ఎప్పుడు దప్పికగొనడు అని చెప్పెను (యోహాను 6:35).

**2. చిన్న కుందేళ్ళు :** సామెతలు 30:26 "చిన్న కుందేళ్ళు బలము లేని జీవులు అయినను అవి పేట సందుల లో నివాసము కల్పించుకొనును". కుందేళ్ళు ఇతర క్రూర జంతువుల నుండి తమ్మును తాము కాపాడు కొనుటకు అవి బొరియలలో జీవిస్తూ ఉంటాయి. ఎవరైనా వాటిని బెదిరిస్తే అవి భూమిలో ఉన్న రంధ్రాలలోనికి వెళ్ళిపోవడం మనం చూస్తాము. వీటి నుండి మనం రక్షణ, లేక భద్రత అనేది నేర్చుకొనవచ్చును.

ఈ రోజు నిర్మాణాలు ఏ విధముగా జరుగుచున్నవో మనం చూచినట్లయితే ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొనే విధముగా అనగా తుఫానులు, భూకంపాలు, సునామీలు, వరదలు వాటిని తట్టుకొనే విధముగా గృహాలు నిర్మాణం జరుగు చున్నది. ఇవి అన్ని కూడా భౌతిక సంబంధమైన రక్షణగా భావించవచ్చు. ఒక భవనాలే కాదు పొలాలు, బంగారం, ధనం కూడ భౌతిక సంబంధమైన రక్షణే. వాటితో పాటు పరలోక సంబంధమైన రక్షణ కూడా మనకు అవసరమైయున్నది. మత్తయి 16:26 "ఒక మనుష్యుడు లోక మంతయు సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకుంటే అతనికి ఏమి ప్రయోజనము? ఒక మనుష్యుడు తన ప్రాణమునకు ప్రతిగా ఏమి యియ్యగలడు?". కనుక పరలోక సంబంధమైన ఆత్మీయ రక్షణ మనకు అవసరమై యున్నది. మనుష్య కుమారుడు తన తండ్రి మహిమగల వాడై తన దూతలతో కూడ రాబోవు చున్నాడు. అప్పుడాయన ఎవని క్రియల చొప్పున వానికి ఫలమిచ్చును" అని వాక్యము చెప్పుచున్నది (మత్తయి

16:22). ఈనాడు యేసుక్రీస్తును దేవుని కుమారుడని ఒప్పుకొని కూడా మనం రక్షణ పొందలేకయున్నాము. "కోతకాలము గతించి యున్నది, గ్రీష్మకాలము జరిగిపోయెను మనము రక్షణ పొందకయే యున్నాము అని వాక్యము చెప్పు చున్నది (యిర్మీయా 8:20).

దేవుని యందు ఉండి దేవునిలో అభివృద్ధి నొంది కూడా రక్షణ విషయములో అలస్యము చేయు చున్నారు. ఉదా :- కొంతమంది మా అబ్బాయికి ఉద్యోగము వచ్చిన తర్వాత రక్షణ పొందుతామని, కొందరయితే మా అమ్మాయికి వివాహం అయిన తర్వాత రక్షణ పొందుతామని చెబుతారు. కాని అపొ.కా. 17:30 "అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్లుగా ఉండెను ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు. ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత నీతిననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడు". గనుక మనకు రక్షణ అనేది అవసరము.

3. మిడతలు : (సామెతలు 30:27) "మిడతలకు రాజు లేదు అయినను అవన్నియు పంక్తులు తీరి సాగిపోవును. ఈ వాక్యము ద్వారా మనం నేర్చుకొనవలసినది ఏమిటి అని ఆలోచిస్తే క్రమశిక్షణ గల జీవులు మిడతలు అని తెలుసుకొనగలం. దేవుని యందు ఉన్నవారు క్రమశిక్షణ కలిగి ఉంటున్నారా? అంటే అది ఒక ప్రశ్నగానే మిగిలిపోతున్నది.

మిడతలకు రాజు లేకున్నా అవి క్రమశిక్షణ కలిగియున్నాయి. కాని మనకు క్రీస్తు అను రాజు ఉన్నాడు. వాక్యాన్ని ఉపదేశించే సువార్తికులు మనకున్నారు. అయినప్పటికి వాక్యాను సారమైన జీవితాన్ని జీవించలేకున్నాము. పూర్వము ఇశ్రాయేలు ప్రజలు క్రమశిక్షణ కలిగి జీవించాలని దేవుడు వారికొరకు ప్రవక్తలను,

యాజకులను, న్యాయాధిపతులను, రాజులను ఏర్పాటు చేసిన విధానం మనం చూస్తాము. అయినను వారు దేవునికి వ్యతిరేకముగా జీవించి, దేవుని యొక్క శిక్షకు లోనైయ్యారు.

క్రైస్తవుల విషయములో క్రమ శిక్షణ లేకపోవడం అంటే లోక సంబంధమైన వాటిని పాటించడమే. "మీరు నేర్చుకొనిన ప్రకారము విశ్వాసమందు స్థిరపరచబడుచు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుటయందు విస్తరించుచు ఆయనయందుండి నడుచుకొనుడి. ఆయనను అను సరింపక మనుష్యుల పారంపర్యా చారమును అనగా ఈలోక సంబంధ మైన మూల పాఠము లను అను సరించి మోసకరమైన నిరర్థకతత్వ జ్ఞానముచేత మిమ్మును చెర పట్టుకొనిపోవువాడెవడైన ఉండునేమో అని జాగ్రత్తగా ఉండుండి" (కొలస్స 2:7,8).

కొలస్సీ 2:16 కాబట్టి అన్న పానముల విషయములోనైను, పండుగ అమావాస్య విశ్రాంతిదినము అనువాటి విషయములోనైనను మీకు తీర్పు తీర్చునెవనికి అవకాశమియ్యకుడి" అని చెప్పడం జరిగింది. కాబట్టి క్రైస్తవులు పండుగలను ఆచరించకూడదు. ప్రతి ఆదివారము మనకు పండుగ దినమే. మన పాపముల నిమిత్తం ఆయన సిలువ మరణం పొందారు. కనుక ఫిలిప్పీ 1:27,28 ప్రకారం అందరు ఒక్క భావముతో సువార్త పక్షమున పోరాడుచు ఏకమనస్సుగలవారై యుండాలి, ఎన్ని శ్రమలు వచ్చిన బెదరకుండా ఉండాలి.

మన జీవితములో ఎన్ని శోధనలు, శ్రమలు వచ్చినా దేవుని యందు తప్పిపోకూడదు. మరియు ప్రస్తుతమందు సమస్త శిక్షయు దు:ఖకరముగా కనబడునే గాని సంతోషకరముగా కనబడదు అయినను దాని యందు అభ్యాసము కలిగినవారికి అది నీతియును, సమాధానకరమైన ఫలమిచ్చును (హెబ్రీ 12:11). కనుక మిడతలవలె మనం క్రమశిక్షణ కలిగి ఉండాలి.

4. బల్లులు : (సామెతలు 30

:28) బల్లిని నీవు చేతితో పట్టుకొనగలవు. అయినను రాజుల గృహములలో అది యుండును.

"కాబట్టి మనము సమయము దొరికిన కొలది అందరి యెడలను విశేషముగా విశ్వాస గృహమునకు చేరిన వారి యెడలను మేలు చేయుదము" అని వాక్యము చెప్పుచున్నది (గలతీ 6:10). బల్లి రాజుల గృహములో కూడ ఉండును. మనము సంఘము అనే విశ్వాస గృహములో ఉండాలి. ఎందుకనగా "మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును పరిశుద్ధ జనమును దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు" (1 పేతురు 2:9).

వెలుగు అనగా యేసుక్రీస్తు వారు. వెలుగులో మనము ఉన్నాము. అంటే రాజులైన యాజక సమూహము, పరిశుద్ధ జనమును, మరియు దేవుని సొత్తయిన ప్రజలము అని గుర్తెరిగి ఉండాలి.

బల్లి పట్టుదల గల జీవి. ఒక జీవిని వేటాడాలి అంటే కదలకుండా ఎంతసేపైనా ఉంటాది. అలాగే మనం విశ్వాసమునందు స్థిరముగా ఉండి మన జీవకిరీటమును సాతాను దొంగలించకుండా కాపాడుకోవాలి (ప్రకటన 3:11).

విశ్వాసి బల్లి అనుకొంటే సాతాను దోమగా భావించవచ్చును. దోమల వలన అనేక వ్యాధులు మనకు వస్తాయి. బల్లికి ముఖ్యమైన ఆహారం దోమ కనుక మనం సాతాను యొక్క తంత్రములకు లొంగకుండా నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా ఉండాలి (1 పేతురు 5:8)

ఎస్. శ్రీనివాసరావు, చీడిగ

83339 506647

# నేనెవని పంపెదను ?

## ( Whom shall I send ?)

క్రీ.పూ.పూర్వము 740లో యెషయా జీవితమును మార్చివేసిన ఒక ప్రశ్నను దేవుడడిగెను. అది యెషయా 6:8లో ఇట్లున్నది : "నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడు పోవును?" పాపములో నశించు పోవుచున్నవారికి సువార్తను చాటించాలనే ఆసక్తిగల దేవుని ప్రజల కు ఈ ప్రశ్న ఈనాడు వర్తించును. ఈ లేఖన భాగాన్ని కొంతలోతుగా ఆలోచిద్దాం.

మొదటిగా, దేవుని పిలుపు ప్రతి క్రైస్తవునికి వర్తించును. ఈ లోకమును దేవుడు ప్రేమించుచున్నాడని మన మెరుగుదుము. మనుష్యులందరు రక్షింపబడి సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము కలిగియుండాలని ఆయన కోరుచున్నాడు (1 తిమో 2:4). అందరు మారుమనసు పొందవలెనని ఆయన కోరుచున్నాడు (2 పేతురు 3:9). నశించువారిని రక్షించుటకు ఆయన తన కుమారుని సిలువ పై బలియిచ్చారు (యోహాను 3:16; 4:42). మానవుల ఆత్మల రక్షణ నిమిత్తము త్రియేక దేవునిలోని ముగ్గురు మూర్తులు తమ ప్రేమను వెల్లడించారు.

ఎవరు వెళ్లుదురు ? నశించిన వారి యెడల దేవుని కున్న ప్రేమనుబట్టి యెషయా 6:8లోని ప్రశ్ననేటికిని మన చెవులలో గింగురు మనుచున్నది. సువార్త ప్రకటించడానికి నీవు, నేను వెళ్లకపోతే ఎవరు వెళ్ళుదురు? "నీవు కాకపోతే ఇంకెవరు? ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?". బోధకులు మాత్రమే లోకమంతా సువార్త చాటలేరు. "కాబట్టి చెదరిపోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి"యని బైబిలు చెప్పు చున్నది (అపొ.కా. 8:4). ఆ చెదరి

పోయిన వారు సామాన్యక్రైస్తవులు, ఏల యనగా ఆ సందర్భములో అపొస్తులలు యెరూషలేములో యుండిరి. "స్తెఫను విషయములో కలిగిన శ్రమను బట్టి చెదరిపోయినవారు యూదులకు తప్ప మరి ఎవరికిని వాక్యము బోధింపక ఫేనీకే, కుప్ర, అంతియొకయు ప్రదేశముల వరకు సంచరించిరి. కుప్రేయులు కొందరును కురేనీయులు కొందరును వారిలో ఉండిరి. వీరు అంతియొకయు వచ్చి గ్రీసుదేశపు వారితో మాటలాడుచు ప్రభువైన యేసును గూర్చిన సువార్త ప్రకటించిరి. ప్రభువు హస్తము వారికితోడై యుండెను గనుక నమ్మిన వారనేకులు ప్రభువు తట్టు తిరిగిరి" (అపొ.కా. 11:19;21). ప్రతికీలును శరీరమునకు బలము కలుగజేయాలి (ఎఫెసీ 4:16). అంటే సంఘములో మనకందరికీ పనియున్నది. మనందరము సువార్త వ్యాప్తి చేయగలము.

రెండవదిగా, దేవుని పిలుపు నంగీకరించేవారి లక్షణములను కొన్నిటిని గమనించుదాం. మొదటిగా మారుమనసు కావాలి. "అయ్యో నేను అపవిత్రమైన పెదవులు గలవాడను, అపవిత్రమైన జనుల మధ్యను నివసించువాడను, నేను నశించితిని" యని యెషయా పలికెను (యెషయా 6:5). పరిశుద్ధుడైన పరలోక దేవునితో తాను పోల్చుకొనినప్పుడు ప్రవక్త యొక్క నిజస్థితి గోచరమయ్యింది. అతడు భ్రష్ఠుడైపోయాడు, పాపము వలన కలుషితము చేయబడినవాడని తానెరుగును. యేసుప్రభువు సన్నిధిలో పేతురు కూడా అట్లే భావించాడు. "అతడు యేసు మోకాళ్ళ యెదుట సాగిలపడి-ప్రభువా, నన్ను విడిచిపొమ్ము, నేను పాపాత్ముడనని చెప్పెను" (లూకా 5:8).

నీవు ఎప్పుడైనా ఈలాగు తలంచావా? "మేమందరము అపవిత్రులవంటివారమైతిమి. మా నీతి క్రియలన్నియు మురికిగుడ్డవలెనాయెను" అని యెషయా 64:6 చెప్పుచున్నది. వృద్ధుడైన బోధకుడొకడిట్లనెను : "నా ఆత్మరక్షణను గూర్చి ఆలోచించక

ముందు నా పాపములు స్వల్పమైనవే యని అనుకొన్నాను. నా పాపము లన్నియు మృతములై పాతిపెట్టబడి ఎవరికిని జ్ఞప్తిలో యుండవనుకొన్నాను. అయితే మారుమనస్సును గూర్చిన బూరధ్వని నిత్య సంగతులను గూర్చి వినిపించి నా పాపములన్నిటికిని పునరుత్థానము కలుగజేసెను. అయ్యో, అవి తిరిగిలేచి సముద్ర యిసుక రేణువుల కంటే విస్తారమాయెను. ఇప్పుడు నా తలంపులే నన్ను నాశనము నకు పంపుటకు చాలు, నామాటలే పాతాళము కంటే దిగువగా నన్ను పంపును, నా పాపముల దుర్వాసన నా నాసికా రంధ్రములలో యున్నది. దానిని నేను భరించలేను". ఇట్టి పరిస్థితిలో మనందరం ఏదో ఒక సమయంలో లేకపోలేదు.

దేవుని పిలుపు నంగీకరించు వారిలో ఒప్పుకోలు కనబడును. తాను అపవిత్రమైన పెదవులు గలవాడని యెషయా ఒప్పుకొనెను (యెషయా6:5). అతడు అపవిత్రమైన నోరు గలవాడై కూడ యుండవచ్చును. వదరబోతును, అబద్ధములాడువాడై యుండవచ్చును. అయితే పాపమును ఒప్పుకొనునప్పుడు ప్రత్యేకముగా దాన్నిగూర్చి అతడు ప్రస్తావించుట గమనించుము. నేను పాపము చేసానని ఒప్పుకొనడం సులభమే. అయితే ఏ పాపము చేసాడో ఒప్పుకొనుట కష్టము! తాము చేసిన పాపమును ప్రత్యేకముగా ఒప్పుకొన్న వారినెందరిని నీవెరుగుదువు? యెషయా 6:8లో యున్న పిలుపును అంగీకరించువారు దేవునిచే వాడబడక ముందు తమ పాపములను ప్రత్యేకము గా ఒప్పుకొన్నవారై యుంటారు.

దేవుని పిలుపు నంగీకరించు వారు చింత కలిగియుంటారు. "అపవి త్రమైన పెదవులు గలవారి మధ్య నేను నివసించుచున్నాడు" అని యెషయా పలికెను. వారి హృదయ స్థితిని వారి నోరు బయలుపరచెనని అతడెరుగును. "హృదయమందు నిండి యుండు దానిని బట్టి నోరు మాటలాడు నని" యేసు చెప్పెను (మత్తయి 12:34).

సువార్త కొరకు దేవుని పిలుపును వినినవారు మార్పు జెందిన వారై యుందురు. యెషయా 6:6,7లో ఇట్లున్నది : "అప్పుడు ఆ సెరావులలో నొకడు తాను బలిపీఠము నుండి కారుతో తీసిన నిప్పును చేతబట్టుకొని నా యొద్దకు ఎగిరివచ్చి, నా నోటికి దాని తగిలించి, ఇది నీ పెదవులకు తగిలెను గనుక నీ పాపమునకు ప్రాయశ్చిత్త మాయెను, నీ దోషము తొలగిపోయెనను", మనము మొదట మారితేనే గాని, పాపములో బడి నశించుచున్న వారిని మార్చలేము!

చివరిగా, దేవుని పిలుపు నంగీకరించువాడు ప్రతిష్ఠించుకొనవలెను. "చిత్తగించుము, నేనున్నాను, నన్ను పంపుమని" యెషయా పలికెను (యెషయా 6:8). నన్ను కాదు ఇంకొకరిని పంపుమని అతడనలేదు. ఇదిగో డబ్బు, ఒక మిషనెరీని పంపుమని అతడ నలేదు. ఒక స్త్రీ దేవుడు అనేక మిషన రీలను పంపాలని ప్రార్థించేది. అయితే తన కుమారుడే మిషనెరిగా వెళ్తాననే సరికి అతడు వెళ్లకుండా సర్వ ప్రయత్నాలు చేసింది! మరొక స్త్రీ తన భర్త మారి క్రైస్తవుడు కావాలని ప్రార్థించేది. అతడు చివరకు క్రైస్తవుడై మిషనెరీగా వెళ్దామనుకొనేసరికి ఆమె సృష్టించిన గందరగోళం ఇంతా అంతా కాదు!

మన పాఠంలోని ప్రశ్నకు నీవెట్లు స్పందించావు? "ఎవరు, నేనా! నేనేమి చేయగలను?" అని అనుకొన్నావా? ఒకాయన ఇట్లు వ్రాసాడు : "నేనొక్కడినే, గాని నేనొకడిని; నేను ప్రతీదీ చేయలేను గాని నేనేమి చేయవలెనో దాన్ని చేయాలి; నేను చేయగలిగింది దేవుని కృప వలన తప్పక చేస్తాను".

నేనెవని పంపుదును? మా నిమిత్తము ఎవడు పోవును? దేవుడు ఈ ప్రశ్న నేటికిని అడుగుచున్నారు. నీవు దానికి జవాబిత్తువా?

- జాన్ఖ ట్రీస్

# సంక్షిప్త వార్తలు

2020 జనవరి 15, 16 తేదీలలో విజయనగరం జిల్లా, చీపురుపల్లి క్రీస్తుసంఘ ఆవరణలో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సువార్తికుల సదస్సు బ్రదర్ రోనీ గూటం గారి ఆధ్వర్యమున ఘనముగా నిర్వహించ బడెను. ఆ మూడు జిల్లాల నుండి ఇంచుమించు 70 మంది సువార్తికులు హాజరై గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని పొందిరి.

ఆ సదస్సులో సోదరులు రోనీగూటం గంభీర సత్యములను బయలుపరుస్తు లేఖానానుసారముగా సత్యవాక్యమును బోధించిరి మరియు సోదరులు ఆర్.సి.హెచ్. సద్గుణరావ్ (శ్రీకాకుళం), కె. ఎలీషా (కాకినాడ), కె. లూకా (చీపురుపల్లి) మరియు కె. తోమస్ (శివరాం) గారు వాక్యపరిచర్యచేసిరి. హాజరైన వారందరు ఎంతో ప్రోత్సాహించబడిరి. సదస్సు రెండవరోజున ముగియగానే సంతోషముతో అందరు తమ తమ గ్రామములకు, పట్టణములకు తరలి వెళ్లిరి. స్థానిక క్రీస్తు సంఘ బోధకులు లూకా గారు, తోమస్ గారు భోజనపానాదుల విషయంలో ఎంతగానో సహకరించిరి. చీపురుపల్లి ఏరియాలో క్రీస్తు పనిని ప్రోత్సాహించుటకు గాను రోనీ గూటం గారు నాయకత్వము వహించుచున్నందున అందరు ఆయనను అభినందించిరి. వీలైనంత త్వరలో శ్రీకాకుళంలో మరల కూడు కొనుటకు అందరు సంకల్పించిరి.

2020 జనవరి 25, 26 తేదీలలో జాషువాగూటం గారు నల్గొండ పట్టణమును దర్శించి 26వ తేదీ ఆదివారమున కేశరాజుపల్లిలో యున్న క్రీస్తు సంఘము యొక్క ఆరాధనతో పాల్గొని వాక్యపరిచర్యచేసిరి. జాషువా గారితో కాకినాడ సత్యవాణి క్రీస్తుసంఘ సభ్యులు మరి ఐదుమంది కూడ ఆరోజు ఆరాధనలో పాల్గొనిరి. నల్గొండ పట్టణములోను, పరిసరప్రాంతములలోను సోదరుల్ను రాజారపు హానోకుగారు మంచిపరిచర్య చేయుచున్నాను.

కేశరాజుపల్లిలో యున్న క్రీస్తుసంఘము తమ ఆలయ నిర్మాణమును కొంత మట్టుకు కొనసాగించి నిధుల కొరతవలన దానిని పూర్తిచేయలేకపోవు చున్నారు. ఆ సంఘము కొరకు ప్రార్థించమనవి.

ఫిబ్రవరి 7,8,9 తేదీలలో కాకినాడ సత్యవాణి క్రీస్తుసంఘ ఆవరణలో జరుగు **Lads to Leader** (బాలకుల నుండి పాలకుల వరకు) కన్వెన్షన్ కొరకు అన్ని ఏర్పాట్లు జరుగుచున్నవి. ఈ పత్రిక ముద్రించుసరికి ఆయా ఏర్పాట్లవిషయమై స్థానిక సంఘస్థులు చురుకుగా పనిచేయుచున్నారు. ప్రార్థించమనవి.

**RNI Regd. No. 69973/98**

**Postal Regd. No. AP/KD-02/2018-2020**

From :
SATYAVAKKU
P.O. Box 80, Kakinada - 533001

Date of Publication : 9th of Every Month
Date of Posting : 15th of Every Month

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004